
E-KABURU

# ఈ-కబురు

10-03-2025 సోమవారం హైదరాబాద్

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



ఆ విషయంలో ఆలియాభట్ చాలా బెటర్

5లో

# మధీనగూడలో అక్రమ భవనాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు



రహదారిపైనే ర్యాంపు, అంబులెన్స్ పార్కింగ్





కాలనీ రోడ్డును ఆక్రమించి ఇనుప గిడ్డర్లతో ఏర్పాటు చేసిన లిఫ్టు, మెట్లు



జాతీయ రహదారిని అనుకొని అక్రమ భవనాల్లో కొనసాగుతున్న ఆసుపత్రులు

## రోగుల ప్రాణాలే పణంగా అనుమతులు

## అంబులెన్సు నిలుపాలన్నా రహదారిని ఆక్రమించాల్సిందే

## రోడ్డును ఆక్రమించి ఐరన్ గిడ్డర్లతో స్టేర్ కేస్, లిఫ్టు ఏర్పాటు

## అడుగు సెట్ బ్యాక్ లేని ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదం జరిగితే అంతే సంగతులు

**ఈ కబురు, శేరిలింగంపల్లి:** ప్రజల ప్రాణాలకు ఏదైనా ఆపద సంభవిస్తే ఆసుపత్రుల కోసం పరుగెడతారు. అవే ఆసుపత్రులు వారి ప్రాణాలనే బలిగొనే యమపాషాలుగా మారితే వారెక్కడికి పరుగులు పెట్టాలి..? అక్రమ భవనాల విషయంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు, నిబంధనలు తుంగలో తొక్కి ఎన్ఓసీలు ఇస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, కనీస పరిశీలన లేకుండా ఆక్రమ భవనాల్లో కొలువుదీరుతున్న ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేస్తున్న వైద్యాధికారులు కలిసి ప్రజల ప్రాణాలనే పణంగా పెట్టి అక్రమ ఆసుపత్రులకు కొమ్ముకాస్తున్నారు. వెరసి హైటెక్ సిటీ పరిధిలో గల్లీకొక 'కాసుపత్రి' పుట్టుకువస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

**అక్రమ భవనాల్లో ఆసుపత్రులు..**

హైటెక్ సిటీ పరిధిలోని మధీనగూడలో పక్క పక్కనే ఉన్న రెండు ఆసుపత్రులు పూర్తిగా ఆక్రమ భవనాల్లో కొనసాగుతున్నాయి. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి నిర్మితమైన ఈభవనాల్లో ధర్జాగా ప్రారంభమైన అసుపత్రుల్లో రోగులకు చికిత్సలేమోకాని పొరపాటున అగ్నిప్రమాదం జరిగితే వారు ప్రాణాలతో బయటపడే అవకాశమే లేకుండాపోయింది. మధీనగూడ ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఓ

మిగతా 2లో



జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్



# ట్రంప్ ఒత్తిడితో కాదు..

## వాణిజ్య సంబంధాల బలోపేతానికే సుంకాల తగ్గింపు..!

ఇంటర్నెట్ డెస్క్: భారత్ అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందన్న అంశాన్ని తాను బహిరంగంగా లేవనెత్తడం వల్లే.. ఆ దేశం ఆందోళన చెంది సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ విషయంపై భారత అధికారిక వర్గాలు మాత్రం ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చుతునట్లు సమాచారం. సుంకాల తగ్గింపునకు చర్యలు నిజమే అయినప్పటికీ.. ఆయన ఆరోపణలతో తాము ఈ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. "గతంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో భారత్ వరుసగా ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాలపై సుంకాలను తగ్గించింది. ప్రస్తుతం ఐరోపా సమాఖ్య, యూకేతోనూ పలు

మిగతా 2లో

# 2026 మార్చి నుంచి కాజీపేటలో కోచ్‌ల ఉత్పత్తి



## రూ.716 కోట్ల వ్యయం.. 65 శాతం పనుల పూర్తి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**ఈ-కబురు, హైదరాబాద్:** కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో 2026 మార్చి నుంచి రైలు కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభమవుతుందని

మిగతా 2లో



# నేటి నుంచే పార్లమెంటు

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా

## మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు

2లో

## నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన

# పంచాయతీరాజ్ ప్రక్షాళన!

## వ్యవస్థలన్నీ ఒకే గొడుగు కిందకు.. మొదటిసారిగా సంస్కరణల బాట

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ

## ఉద్యోగ సంఘాలు, భాగస్వాములతో చర్చలు



**ఈ-కబురు, అమరావతి:** పంచాయతీరాజ్ శాఖ ప్రక్షాళనకు మొదటి అడుగు పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఆ శాఖను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆ శాఖకు సంబంధించిన వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి గ్రామీణులకు విస్తృతంగా సేవలందించాలని నిర్ణయించారు.

మిగతా 2లో

# సామాజిక న్యాయం.. విధేయత

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ దృక్కోణమిదే

## అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, విజయశాంతిలకు అవకాశం

## ఒకటి సీపీఐకి

**ఈ-కబురు, హైదరాబాద్:** ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విధేయతకు, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎమ్మెల్యేలు ఎన్నుకునే కోటాలో జరిగే ఈ ఎన్నికలకు సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్న అద్దంకి దయాకర్, కెతావత్ శంకర్‌నాయక్‌లకు టికెట్లను ఖరారు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన విజయశాంతికి కూడా అవకాశం ఇచ్చింది. ఈ ముగ్గురి పేర్లను కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం సాయంత్రం ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ పేర్లను ప్రకటించినట్లు ఆయన వివరించారు. మొత్తం 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని

మిగతా 2లో







# మధీనగూడలో అక్రమ భవనాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు

మొదటి పేజీ తరువాయి

అక్రమ భవనంలో గతకొన్ని సంవత్సరాలుగా 'అంకుర' కార్పొరేట్ ఆసుపత్రి కొనసాగుతుండగా, ఈ ఆసుపత్రికి కనీసం అంబులెన్సు నిలిపేందుకు కూడా పార్కింగ్ వసతి లేకపోవడం మన వైద్యాధికారులకు వింతగా అనిపించడంలేదు. ఒక్క అడుగు కూడా సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మితమైన ఈఆసుపత్రికి అనుమతి ఎలా ఇచ్చారన్నది జిల్లా వైద్యాధికారులతో పాటు ఫైర్ సేఫ్టీ విభాగానికే తెలియాలి. సంబంధిత అధికారులు కళ్లు మూసుకోవడంతో ఈ ఆసుపత్రి భవన యజమాని మరింత రెచ్చిపోయి కాలనీ అంతర్గత రహదారిని ఆక్రమించాడు. రహదారి మొత్తం మూసివేసి ఇనుమ గడ్డర్లతో రహదారి మీద ఏర్పాటు చేసిన స్టేర్ కేస్, లిఫ్టులను ఉపయోగిస్తున్నాడు. ఈ ఆసుపత్రికి మరోవైపు కాలనీ లోపలికి వెళ్లే ప్రధాన రహదారి ఉండగా, సదరు రహదారిని సైతం ఆక్రమించి ర్యాంపును ఏర్పాటు చేశారు. అసలే ర్యాంపు రహదారిపై ఉండగా, సదరు ర్యాంపు ముందు అంబులెన్స్ పార్కింగ్ ఏర్పాటు చేసి కాలనీ లోపలికి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో ఫైరింజన్ తిరిగేందుకు సరివడా సెట్ బ్యాక్ ఉండాల్సిన భవనాన్ని ఒక్క అడుగు కూడా వదలకుండా నిర్మించారు. ఆసుపత్రి ముందున్న జాతీయ రహదారిని సైతం ఆక్రమించి వాహనాల పార్కింగ్ చేపడుతుండగా, రహదారి పైనే భారీ ట్రాన్స్ ఫార్మర్ ను సైతం ప్రమాదభరితంగా ఏర్పాటుచేశారు. ఈ భవనం పెంట్ హౌజ్ లో ఓ భారీ డయాగ్నొస్టిక్ సెంటర్ ను సైతం నిర్వహిస్తున్నారు. ఈ ఆసుపత్రికి ఆనుకొని ఉన్న మరో అక్రమ భవనంలో 'అర్చన' పేరుతో మరో ఆసుపత్రి కొలువై ఉంది. ఈ ఆసుపత్రి సైతం భవనం వెనుక వైపు ఉన్న అంతర్గత రహదారిని ఆక్రమించి ఇనువ గిడ్డర్ల మీద స్టేర్ కేస్, లిఫ్టులను ఏర్పాటు చేసింది. రెండు అనుపత్రులకు సెల్లార్ వసతి ఉన్నా అవి పేరుకే... సెల్లార్ లను ఆఫీసు కార్యకలాపాలకు వాడుకుంటూ



వాహనాల పార్కింగ్ తో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

ఆసుపత్రులకు వచ్చే వాహనాలను మాత్రం జాతీయ రహదారి మీద పార్కింగ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా చందానగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా వైద్యాధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు కళ్లు మూసుకోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల ప్రాణాలతో పాటు స్థానికుల ప్రాణాలతో ఈ కార్పొరేట్ ఆసుపత్రులు చెలగాటమాడుతున్నాయి..

**ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు..?**

అగ్నిప్రమాదాలు జరిగితే కనీసం ఫైరింజన్ నీటిపైపు కూడా దూరలేని విధంగా అంగుళం ఖాళీ జాగా వదలకుండా నిర్మించిన భవనాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు కొనసాగుతుండగా, అందులో అగ్నిప్రమాదం జరిగితే ఎవరు బాధ్యతవహిస్తారన్నది సమాధానంలేని ప్రశ్నగా వుంది. భవన నిర్మాణ సమయంలో కాసులకు కక్కుర్తిపడిన జిహెచ్ఎంసి అధికారులా.. ఇలాంటి భవనాల్లో వెలిసే ఆసువత్రులపై కొరడా ఝులిపించాల్సిన అగ్నిమాపక శాఖ అధికారులా.. లేదా భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఫైర్ ఎన్ఓసి లేకుండానే అనుమతులు మంజూరు చేసే వైద్యవిభాగం అధికారులా అన్నది తేలాల్సి వుంది. ఇలాంటి అక్రమ భవనాల్లోని ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదం జరిగితే ఆసహాయంగా ఉండే రోగుల వరిస్థితి ఊహించలేనిది కాదు.

**ఆక్రమార్కుల సేవలో అగ్నిమాపక శాఖ...**

ఆసుపత్రి నిర్వహించేందుకు అనుమతి రావాలంటే ఉండాల్సిన ఎన్ఓసీల్లో ప్రధానమైనది ఫైర్ సేఫ్టీ. అయితే ఎన్ఓసి కోసం ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం భవనం చుట్టూ సెట్ బ్యాక్, కనీస పార్కింగ్ వసతి ఉండాలి. ఆసుపత్రి లోపల మంటలార్పే పరికరాలను ఏర్పాటు చేయాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఫైరింజన్ తిరిగే విధంగా భవనానికి సెట్ బ్యాక్ ఉండాలి. అగ్నిమాపక శాఖ అధికారులు ఈ సదుపాయాలను మొత్తం పరిశీలించిన తరువాతే ఎన్ఓసీ జారీ చేయడంతో పాటు క్రమం తప్పకుండా ర్యాండమ్ తనిఖీలు చేపట్టాలి. అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ ఉంటేనే వైద్య అధికారులు ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయాలి. కానీ భవన నిర్మాణ సమయంలో కళ్లు మూసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు సదరు ఆసుపత్రులు రహదారులను ఆక్రమిస్తున్నా పట్టించుకోకపోగా, అగ్నిమాపక శాఖ, వైద్య అధికారులు సైతం కార్పొరేటు ఆసుపత్రుల సేవలో తరిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. ఆక్రమ భవనాల్లో ఏర్పాటు చేసిన ఆసుపత్రుల కారణంగా అగ్నిప్రమాదాలు జరిగిన ఘటనలు నగరంలో గతంలో కొకొల్లలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే హడావిడీ చేసే బదులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రమాదాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల మీద ఉంది. ఇప్పటికైనా ఇలాంటి ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బలహీనవర్గాలకు పెద్దపీట

**ఈ-కబురు, అమరావతి:** ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు తెదేపా అభ్యర్థులుగా బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మలను పార్టీ ఆదివారం సాయంత్రం ప్రకటించింది. వెనుకబడిన వర్గాలకు చెందిన ఇద్దరికి, ఎస్సీ సామాజికవర్గం నుంచి ఒకరికి అవకాశం కల్పించింది. మిత్రపక్షాలైన జనసేన, భాజపాలకు చెరో స్థానాన్ని కేటాయించింది. జనసేన అభ్యర్థిగా నాగబాబు ఇప్పటికే నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలుకు సోమవారం చివరి రోజు. ఈ దఫాలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా, ఎమ్మెల్యేల సంఖ్యాబలం దృష్ట్యా ఎన్డీయేకు అన్ని స్థానాలూ గెలుచుకునే అవకాశముంది. పొత్తు ధర్మంలో భాగంగా తెదేపా మూడు స్థానాలతో సరిపెట్టుకోవడం, పార్టీలో ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో అభ్యర్థుల ఎంపికకు ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృత కసరత్తు చేశారు. ప్రాంతాలు, సామాజికవర్గాలు, పార్టీకి అందించిన సేవలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. పదవీ విరమణ చేస్తున్న ఎమ్మెల్సీల్లో బీటీ నాయుడికి మాత్రమే మళ్లీ అవకాశం దక్కింది. యనమల రామకృష్ణుడు, అశోక్‌బాబు, దువ్వారపు రామారావులతో పాటు పదవికి రాజీనామా చేసిన జంగా కృష్ణమూర్తిలకు వివిధ సమీకరణాల దృష్ట్యా మళ్లీ అవకాశం కల్పించలేకపోయారు.

**ఆపత్కాలంలో అధినేత దూతగా**

పార్టీకి మొదటినుంచీ వెన్నెముకగా నిలిచిన బీసీ, ఎస్సీలకు ఎమ్మెల్సీ పదవుల్లోనూ తెదేపా అగ్ర ప్రాధాన్యమిచ్చింది. మూడు ప్రాంతాలకూ సమ ప్రాధాన్యమిస్తూ రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్రల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసింది. వారిలోనూ ఓ మహిళకు చోటు కల్పించింది. కర్నూలు జిల్లాకు చెందిన బీటీ నాయుడు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన్ను కొనసాగించాలని నిర్ణయించింది. గత వైకాపా ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి, రాజమహేంద్రవరం జైల్లో ఉంచినప్పుడు.. న్యాయవాది కూడా అయిన బీటీ నాయుడు నిత్యం జైలుకి వెళ్లి ములాఖత్‌లో ఆయన్ను కలిసేవారు. అధినేత సందేశాన్ని పార్టీ నాయకులకు చేరవేసేవారు. అప్పట్లో అందించిన సేవలతోపాటు ఆయన సామాజికవర్గం నుంచి శాసనమండలిలో పార్టీ తరఫున ఇంకెవరూ లేకపోవడం కూడా కలిసొచ్చింది. మొదటినుంచీ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన బీద రవిచంద్ర యాదవ్.. తెదేపా సంస్థాగత వ్యవహారాల్లో, సార్వత్రిక ఎన్నికల సమయంలో క్రియాశీలకంగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం దక్కింది. 2015 నుంచి 2021 మధ్య కూడా ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు.

**వైకాపాకు సవాలు విసిరిన గ్రీష్మ**

తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ ముద్ర కనిపించింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ లోకేశ్ టీం సభ్యులుగా ఉన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం దక్కిన యువనేత గ్రీష్మ.. మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన సీనియర్ నాయకురాలు కావలి ప్రతిభాభారతి కుమార్తె. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన గ్రీష్మ ఉన్నత విద్యావంతురాలు. 2014లో తెదేపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పార్టీలో చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారు. 2019-24 మధ్య తెదేపా విపక్షంలో ఉండగా, వైకాపా నాయకుల దాష్టీకాల్ని, సామాజిక మాధ్యమాల్లో చేసే దాడుల్ని దీటుగా ఎదుర్కొన్నారు. పదునైన వ్యాఖ్యలతో వారిపై విరుచుకుపడుతూ ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందారు. అప్పట్లో మహానాడు వేదికపై నుంచి వైకాపా నాయకుల్ని తొడగొట్టి సవాల్ చేశారు. అది పార్టీ శ్రేణుల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. గ్రీష్మ ప్రయోగించిన భాషపై కొన్ని విమర్శలు వచ్చినా, ఆ శైలితోనే ఫైర్‌బ్రాండ్‌గా ముద్రపడ్డారు. తెదేపా అధికార ప్రతినిధిగా ఉన్న గ్రీష్మకు.. కూటమి అధికారంలోకి వచ్చాక తొలి విడతలోనే రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్ పదవి దక్కింది. ఇప్పుడు ఎమ్మెల్సీగా పదోన్నతి లభించింది. ఎమ్మెల్సీలుగా పదవీ విరమణ చేస్తున్న వారిలో సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఒకరు. ఇప్పటికే యనమల కుటుంబం నుంచి ముగ్గురు పదవుల్లో ఉండటంతో ఆయనకు మళ్లీ కొనసాగింపు ఇవ్వలేకపోయారని సమాచారం.

# సామాజిక న్యాయం.. విధేయత

మొదటి పేజీ తరువాయి

బట్టి కాంగ్రెస్‌కు 4, భారాసకు ఒకటి దక్కనున్నాయి. తమకు వచ్చే నాలుగులో ఒక సీటును పొత్తు ధర్మం ప్రకారం సీపీఐకి కేటాయించినట్లు కేసీ వేణుగోపాల్ తెలిపారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని కొత్తగూడెం సీటును కేటాయించింది. అప్పుడు తమకు రెండు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ కొత్తగూడెం ఒకటే ఇచ్చి భవిష్యత్తులో ఎమ్మెల్సీ సీటు ఇస్తామని కాంగ్రెస్ సీపీఐకి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీటును కేటాయించింది.

**ఓసీలకు ఒక్కటన్నా ఇచ్చే ఆనవాయితీకి భిన్నంగా...**

ఒకేసారి 4 ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కే అవకాశాలుండగా ఒకటి సీపీఐకి ఇచ్చి... మిగిలిన మూడింటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించడం విశేషం. ఎస్సీల్లో అద్దంకి దయాకర్‌కు, ఎస్టీల్లో శంకర్‌నాయక్‌కు, బీసీల్లో విజయశాంతికి ఇచ్చింది. ఎప్పుడూ ఒక్కటైనా ఓసీలకు ఇవ్వడం కాంగ్రెస్‌లో ఆనవాయితీ. పైగా ఈసారి ఆ వర్గం నుంచి పలువురు సీనియర్, జూనియర్ నేతలు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా సామాజిక న్యాయానికే పార్టీ పెద్దపీట వేసింది. బీసీ కులగణన పూర్తిచేసి చట్టబద్ధత కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో పాటు ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేసిన నేపథ్యంలో బడుగువర్గాల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి ఉందని చెప్పడానికి టికెట్ల కేటాయింపులోనూ ఆదర్శంగా నిలిచామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు



చెప్పారు. అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లు ఇద్దరూ సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలని ఆయన గుర్తుచేశారు. సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నవారికే టికెట్లు ఇవ్వాలని తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏఐసీసీకి సిఫార్సు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవమే!**

ఎమ్మెల్యేల కోటాలో జరగనున్న 5 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ ముగ్గురు అభ్యర్థులను పోటీలో నిలపగా.. సీపీఐ ఒకరిని, భారాస ఒకరిని బరిలోకి దించాయి. దీంతో ఐదుగురి ఎన్నిక లాంఛనమే కానుంది. ఈనెల 11న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. అభ్యర్థిత్వ ఉపసంహరణకు 13న మధ్యాహ్నం వరకూ గడువు ఉంటుంది. ఐదు స్థానాలకు ఐదుగురి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే.. ఈనెల 20న ఎన్నిక నిర్వహిస్తారు. అయితే భారాస కూడా ఒక అభ్యర్థినే ప్రకటించడంతో.. పోటీలో ఐదుగురే మిగిలారు. దీంతో ఎన్నిక జరిగే అవకాశాలు లేనట్లే. 13న ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు శాసనసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు.

**అసెంబ్లీ, లోక్‌సభ టికెట్లు రాకున్నా**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ అద్దంకి దయాకర్‌కే అని బాగా ప్రచారం జరిగింది. చివరికి సామేల్‌కు దక్కింది. అప్పుడు ఆయనకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ టికెట్ ఇస్తామని పార్టీ సర్దిచెప్పింది. కానీ చివరికి ఇతర కారణాలతో అది కూడా ఇవ్వలేకపోవడంతో ఇప్పుడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. 1971లో ప్రస్తుత సూర్యాపేట జిల్లా నెమ్మికల్ గ్రామంలో పుట్టిన అద్దంకి.. ఎంకాం, ఎంసీఏ, పీహెచ్‌డీ చేశారు. 2014లో, 2018లో తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. పీసీసీ అధికార ప్రతినిధి, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయనకు ముగ్గురు పిల్లలు.

**అంచెలంచెలుగా ఎదిగి..**

శంకర్‌నాయక్ 1972లో ప్రస్తుత నల్గొండ జిల్లాలోని మారుమూల కేతావత్ తండాలో పుట్టారు. వ్యవసాయం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు. 1998 నుంచి 2001 వరకూ దామెరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2001, 2014 స్థానిక ఎన్నికల్లో దామెరచర్ల జనరల్ సీటు నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన ఎస్టీ అభ్యర్థిగా చరిత్ర సృష్టించారు. 2006-11 వరకూ దామెరచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా, 2011-14 వరకూ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2016-19 వరకూ మిర్యాలగూడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2019 నుంచి నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ నేతల మన్నన పొందారు.

**కాంగ్రెస్‌లో చేరేముందే హామీ**

సినీనటి విజయశాంతి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. గతంలో భారాస (అప్పటి తెరాస) తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. భాజపాలోనూ పనిచేశారు. కాంగ్రెస్‌లో చేరేముందే తనకు ఒక పదవి ఇవ్వాలని అప్పటి ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఠాక్రే వద్ద ఆమె షరతు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ హామీని గుర్తుచేస్తూ కొద్దిరోజుల కిందట దిల్లీ వెళ్లి ఏఐసీసీ నేతలను కలిసి ఎమ్మెల్సీ టికెట్‌ను అడిగినట్లు సమాచారం. ఆమెకు హామీ ఇచ్చినట్లు ఠాక్రే ఏఐసీసీకి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ కోటా కింద ఆమెకు పార్టీ టికెట్ ఇచ్చింది. పలువురు బీసీ నేతలు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. కానీ విజయశాంతికి అదే కోటా టికెట్ కేటాయించడం విశేషం.

## మొదటి పేజీ తరువాయి

### ట్రంప్ ఒత్తిడితో కాదు..

ఒప్పందాల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్యంతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి వీటిని తగ్గించాలని న్యూదిల్లీ నిర్ణయం తీసుకుంది. అంతే కానీ, అమెరికా భారత్‌పై విధించనున్న సుంకాల అమలుకు సమయం దగ్గరపడుతున్నందుకు కాదు" అని భారత అధికారులు చెబుతున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నివేదికల ప్రకారం.. వ్యవసాయ ఉత్పత్తులు మినహా దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తొలగించాలని అమెరికా భారత్‌ను కోరింది. న్యూదిల్లీకి వాషింగ్టన్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 118.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. కాగా 2030 నాటికి దీనిని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో భారత్ ముందుకు వెళ్తోంది.

### 2026 మార్చి నుంచి కాజీపేటలో కోచ్‌ల ఉత్పత్తి

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతినెలా 50 చొప్పున ఏడాదికి 600 ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కోచ్‌లు, వ్యాగన్ల ఉత్పత్తి, మరమ్మతు చేసే ఈ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు రూ.716 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటివరకు 65 శాతం పనులు పూర్తయ్యాయని, దాదాపు రూ.360 కోట్ల నిధులు ఖర్చయ్యాయని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

**ఇంజిన్ అవసరం లేని ఈఎంయూలు..**

'కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ దేశ రైలు కోచ్‌ల తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. వరంగల్ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ఇక్కడ ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పాటు ఇంజిన్ ప్రత్యేకంగా అవసరం లేని ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లు(ఈఎంయూ) ఉత్పత్తి అవుతాయి. నెలకు రెండేసి ఈఎంయూ ఉత్పత్తి అవుతాయి. ఒక్కో దాంట్లో 12 బోగీలు ఉంటాయి. ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లు ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లే. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, ఈఎంయూలతో పాటు గూడ్సు రైళ్ల వ్యాగన్లూ ఉత్పత్తి అవుతాయి. ఏడాదికి 2,400 వ్యాగన్ల ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. 160 ఎకరాల్లో నిర్మిస్తున్న యూనిట్‌లో 60,753 చ.మీ. విస్తీర్ణంలో ప్రీఇంజినీర్డ్ భవనాలు వస్తాయి' అని కేంద్ర మంత్రి వివరించారు.

### పంచాయతీరాజ్ ప్రక్షాళన!

పంచాయతీరాజ్ నిపుణులతో సంప్రదించిన ఉపముఖ్యమంత్రి.. అన్నిటినీ ఒక చోటకు తెచ్చే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 22న డివిజినల్ అభివృద్ధి అధికారులు (డీఎల్‌డీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవోలు), ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారులు (డిప్యూటీ సీఈవోలు), డివిజినల్ పంచాయతీ అధికారులు (డీఎల్‌పీవోలు), విస్తరణ అధికారుల (పీఆర్-ఆర్‌డీ ఈవోలు) ఉద్యోగ సంఘా లు, పంచాయతీరాజ్ అసోషియేషన్ జేఏసీ నేతలతో తాడేపల్లి కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ, ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపట్టదలచిన సంస్కరణలను వారి ముందుంచారు. వీటిపై అన్ని కేడర్ల అధికారులు సంతృప్తి చెంది.. ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉపముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రక్షాళన దశలో మొదట ఉద్యోగుల కేడర్ విషయంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. ముందుగా ఈ శాఖలో పనిచేసే అధికారుల కేడర్ హోదాకు సంబంధించి ఉన్న అంతరాలను తొలగించే ప్రతిపాదనను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంతో మొదటి అడుగు విజయవంతమైంది.

**కేడర్ పోస్టులకు ఒకే హోదా..**

సంస్కరణల్లో మొదటగా ఎంపీడీవో, డీఎల్‌పీవోలను ఒకే కేడర్‌గా నిర్ధారించారు. అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్‌లో ఉన్న డీపీవోలకు డివిజినల్ అభివృద్ధి అధికారి (డిప్యూటీ డైరెక్టర్) హోదా కల్పించారు. ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీసీ) ప్రిన్సిపాళ్లకు డిప్యూటీ కమిషనర్ (అదనపు డైరెక్టర్) హోదా ఇచ్చారు. డీడీవో, డిప్యూటీ సీఈవో, డీపీవోలను ఒకే కేడర్ కిందకు చేర్చారు. వారు పదోన్నతి పొంది జడ్పీ సీఈవోలవుతారు. అయితే ఎంపీడీవోలను దేశవ్యాప్తంగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(బీడీవో)లుగా పిలుస్తున్నందున మన రాష్ట్రంలో కూడా బీడీవోలుగానే పరిగణించాలని పంచాయతీరాజ్ అధికారుల సంఘాలు గతంలో ప్రభుత్వాన్ని కోరాయి.

## నేటి నుంచే పార్లమెంటు

**ఈ-కబురు, న్యూఢిల్లీ:** పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మ?ధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత గొడవ చేసినా సాధ్యమైనంత త్వరలో వక్ఫ్ బిల్లును చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇండియా కూటమి పార్టీలన్నీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు వ్యూహ రచన చేస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో రైల్వే సవరణ బిల్లు, సహకార సంఘాల్లో పనిచేసే వ్యక్తులకు తగిన శిక్షణను అందించేందుకు త్రిభువన్ సహకారీ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు.



# బీసీలకు 42% రిజర్వేషన్లు దక్కకుండా కుట్ర

భారాస, భాజపాలది తొండి వాదన

రైతన్నలు.. నేతన్నలకు సమప్రాధాన్యం

ఆసిఫాబాద్ వైద్యకళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

## పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్

**ఈ-కబురు, హైదరాబాద్- అబిడ్స్:** వెనకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా మొగ్గలోనే తుంచేయాలనే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బలహీనవర్గాలకు రిజర్వేషన్లు వస్తే అధికారంలో వాటా అడుగుతారని భావించి భారాస, భాజపాలు కులగణన లెక్క తప్పని తొండివాదన తెస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో కులగణనకు పునాదిరాయి పడితే.. పురిట్లోనే గొంతు నొక్కాలని కొందరు కుట్ర చేస్తున్నారన్నారు. దీన్ని తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్ అమలుచేసి చూపిస్తామని సీఎం ప్రకటించారు. బీసీల లెక్క పక్కాగా తేలి.. చదువులు.. ఉద్యోగాలు.. రాజకీయాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానంచేస్తే అది కేంద్రం మెడపై కత్తిలా వేలాడుతుందని అడ్డుకుంటున్నారన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ మహాసభల ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కులగణన చేపట్టిన ముఖ్యమంత్రికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ మహాసభ ఏకగ్రీవ తీర్మానం చేసి.. ఆయన్ను సన్మానించింది. ఈ సందర్భంగా రేవంత్ స్వయంగా మగ్గం నేశారు. అనంతరం సభలో మాట్లాడారు.

**పద్మశాలీలకు న్యాయం చేయడమే లక్ష్యం**

'కాంగ్రెస్ ప్రభుత్వం మండల్ కమిషన్ వేయకుంటే 27 బలహీన వర్గాలకు రిజర్వేషన్ వచ్చేదా? భారాస ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో తేల్చిన బీసీల లెక్క 51 శాతం అయితే మాప్రభుత్వం సామాజిక సర్వేలో 56.33 శాతం అని నిర్ధారించింది. గతంలో ఉన్నత కులాలవారు 21 శాతం అని తేలగా.. మా సర్కారు 15.28 శాతం అని పక్కాలెక్క తేలిస్తే తప్పంటున్నారు. కులగణన సర్వేలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ జోడోయాత్ర సందర్భంగా చెప్పినట్లు రాష్ట్రంలో కులగణన చేశాం. రైతన్నలు, నేతన్నలకు సమప్రాధాన్యం ప్రభుత్వ లక్ష్యం. ఆత్మగౌరవంలోనే కాదు.. త్యాగంలోనూ పద్మశాలీలు ముందుంటారు. రాష్ట్ర సాధన కోసం తన పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీనే ఇందుకు నిదర్శనం. ఏ అవకాశం వచ్చినా పద్మశాలీలకు న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం. మేం అధికారంలోకి రాగానే కేంద్రంతో చర్చించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐటీహెచ్) ఏర్పాటు చేసి.. దానికి బాపూజీ పేరు పెట్టాం. పద్మశాలీలకు చెల్లించాల్సిన బకాయిలు, విద్యుత్ బిల్లులు, యార్న్ డిపో సహా పలు అంశాలను పరిష్కరించాం. 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు నాణ్యమైన చీరల కోసం రూ.600 కోట్ల ఆర్డర్ ఇచ్చాం. తెలంగాణ మలిదశ ఉద్యమంలో టైగర్ ఆలె నరేంద్రను కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రిని చేసింది. గాంధీభవన్‌లో సేవలందించిన రాపోలు ఆనందభాస్కర్‌ను రాజ్యసభకు పంపాం. మాజీ ఎమ్మెల్యే అనిల్‌కు మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చాం. ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు కొండాలక్ష్మణ్ బాపూజీ పేరు పెడతాం. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో సోలాపూర్ పద్మశాలీలు కోరినట్లు భవన నిర్మాణానికి రూ.కోటి నిధులను అందిస్తాం” అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 15 నెలల కాలంలోనే రూ.1600 కోట్ల నేతన్నల బకాయిలు, ఇతర కార్యక్రమాలకు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌కు దక్కుతుందన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి నరహరి, మాజీమంత్రి హనుమంతరావు, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందిగట్ల స్వామి, రాష్ట్రాధ్యక్షుడు మురళి సహా పలువురు ప్రసంగించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మినరల్ కార్పొరేషన్ ఛైర్మన్ ఇ.అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం నేతలు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం సందర్భంగా క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే గాంధీ



విజేతలకు అందజేసే ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, నిర్వాహకులు

# మాతృశ్రీనగర్ కాలనీ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మాదాపూర్ డివిజన్ మాతృశ్రీ నగర్ కాలనీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-8 ఘనంగా ప్రారంభమైంది. ఈ ఛాంపియన్ షిప్ ను ఆదివారం తెలంగాణ పిఎసి ఛైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా బ్యాట్ పట్టి క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే గాంధీ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టోర్నమెంట్ విజేతలకు అందజేసే ట్రోఫీని ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మాతృశ్రీనగర్ కాలనీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-8 నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయం అని, క్రికెట్ క్రీడపై ఆసక్తి కలిగిన వారు పెద్ద సంఖ్యలో ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నారని అన్నారు. క్రీడలు పిల్లలలో దాగిన సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నేటి యువతకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. క్రీడలతో శారీరక శ్రమ, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. తమ పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





ఫారెస్ట్ ట్రెక్ పార్కులో పర్యటిస్తున్న సందర్శకులు

# ఫారెస్ట్ ట్రెక్ పార్క్ లో ఫారెస్ట్ బాత్

## పక్షులు, చెట్లను చూస్తూ సాగిన ట్రెక్కింగ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్ పేరిట ఫారెస్ట్ ట్రెక్ పార్క్ లో ఆదివారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు “ఫారెస్ట్ బాత్” కార్యక్రమం నిర్వహించారు. ఈ ఫారెస్ట్ బాత్ కార్యక్రమంలో 40 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. ఇందులో 9 మంది నిజాంపేట్, కూకట్ పల్లి, కొండాపూర్, నార్సింగికి చెందిన వారు కాగా, 31 మంది సాయి సేవ సంఘ్ కు చెందిన 10 వ తరగతి విద్యార్థులు ఉన్నారు. ఫారెస్ట్ బాత్ కి విచ్చేసిన వారికి ఎఫ్ఆర్ఓ ఎస్.శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్ లు స్వాగతం పలికి, ఫారెస్ట్ బాత్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని వివరించడంతో పాటు వారిని 2 టీములుగా విభజించి ట్రెక్కింగ్, నేచర్ ట్రయిల్ మరియు బర్డింగ్ చేయించారు. పక్షుల వీక్షణకు వచ్చిన వారు చూసిన పక్షులను పాకెట్ గైడ్ ద్వారా గుర్తించగా, నిపుణులు పక్షుల వీక్షణ ఎలా చేయాలి, వాటిని ఎలా గుర్తించాలి, ఎలాంటి పక్షులు ఎలాంటి శబ్దలు చేస్తాయి వంటి విషయాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ వి.తనూజ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్ కళ్యాణపు, నేచురలిస్ట్ అపరంజని, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మా రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ యూనివర్సిటీ పీడీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా నాగరాజు నియామకం



ఎన్నికైన సెంట్రల్ యూనివర్సిటీ పీడీఎస్ యూ నూతన కమిటీ

ఈ-కబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీడీఎస్ యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వర్సిటీలోని ఏంఏ తెలుగు విభాగం విద్యార్థి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థుల సమస్యల పరిస్కారం కోసం పీడీఎస్ యూ గత ఐదు నేలల కార్యక్రమాల ఉద్యమ సమీక్ష నిర్వహించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా. పీడీఎస్ యూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా నాగరాజు జనరల్ సెక్రెటరీగా భీంసేన్, కన్వీనర్ గా సందీప్, వైస్ ప్రసిడెంట్స్ గా రాము, బాలరాజ్, జాయింట్ సెక్రెటరీలుగా అనిల్, రాము, ట్రెజరర్ గా బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా అంకుర్, సంపత్, రోహిత్,, వరుణ్, శివ, అప్పలకొండ, నితిన్ లు ఎన్నికయ్యారు. ఈ



అధ్యక్షుడు నాగరాజు

సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని యూనివర్సిటీలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు.

# సైబరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

## దొరికిన 478 మంది మందుబాబులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** వారాంతాలు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మందుబాబులపై సైబరాబాద్ పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. పోలీసులు ఎన్ని తనిఖీలు చేసినా మందుబాబులు మాత్రం మద్యం సేవించి వాహనాలు నడపడం ఆపడం లేదు. సైబరాబాద్ పరిధిలో పోలీసులు ఎంతగా కట్టడి చేసిన మందుబాబులు మాత్రం మద్యం సేవించి వాహనాలతో బయటకు వస్తున్నారు. ముఖ్యంగా వారాంతాల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో వందల సంఖ్యలో మందుబాబులు పట్టుబడుతున్నారు. ఈ వారం సైబరాబాద్ పోలీస్? కమిషనరేట్?లో 16





డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్? పోలీస్? స్టేషన్ల లిమిట్స్?లలో డ్రంక్? అండ్? డ్రైవ్? తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 478 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్? పోలీసులకు చిక్కారు. ఇందులో అత్యధికంగా మియాపూర్? పోలీస్? స్టేషన్? లిమిట్స్?లో 101 మంది మందుబాబులను పోలీసులు పట్టుకున్నారు. అత్యల్పంగా రాయదుర్గం, మేడ్చల్ ట్రాఫిక్? పోలీస్? స్టేషన్ల లిమట్స్?లో 15 మంది దొరికారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన వారిలో ద్విచక్రవాహనదారులే ఎక్కువగా ఉన్నారు. ఈ వారాంతం నిర్వహించిన డ్రంక్? అండ్? డ్రైవ్?లో పట్టుబడిన వారిలో 388 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, 70 మంది కారు డ్రైవర్లు ఉన్నారు. మద్యం తాగి దొరికిన వారిలో187 మంది 31 నుండి 40 ఏండ్ల వయస్సు ఉన్న వారు, 172 మంది 21 నుండి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు దొరికారు. వీరిపై కేసులు నమోదు చేసిన సైబరాబాద్? ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# లాభాలు రావొచ్చు కానీ..

**ప్రతికూల టారిఫ్ వార్తలొస్తే నష్టాలే**

**నిఫ్టీ బ్యాంక్ 48,000 దిగువకొస్తే పతనమే**

**బ్యాంకింగ్, ఎఫ్ఎమ్‌సీజీలకు సానుకూలతలు**

**విశ్లేషకుల అంచనాలు**

**మార్కెట్లకు శుక్రవారం హెూలీ సెలవు**

**స్టాక్ మార్కెట్ ఈ వారం**




ఈ వారం సూచీలు రాణించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశీయ మార్కెట్లలో ఇప్పటికే భారీగా విక్రయాలు చోటుచేసుకోవడం, తాజాగా డాలరు సూచీ నష్టపోతుండటం ఇందుకు దోహదం చేయొచ్చని చెబుతున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడి నుంచి టారిఫ్‌లకు సంబంధించి ఏదైనా ప్రతికూల వార్త వస్తే మాత్రం మార్కెట్లు పడతాయని అంటున్నారు. అమెరికా టారిఫ్‌ల అమలుపై నెలకొన్న అనిశ్చితి మదుపర్లకు ఆందోళన కలిగిస్తోంది. ఈ వారం ర్యాలీకి అవకాశాలున్నా.. ఆ లాభాలు నిలబడతాయన్న నమ్మకం లేదని ఎక్కువ మంది విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశీయంగా వెలువడనున్న పారిశ్రామికోత్పత్తి, రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలను పరిశీలించాలి. వ్యవస్థలో ద్రవ్యలభ్యత పెంచాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయం సానుకూలం కావచ్చు. హెూలీ సందర్భంగా శుక్రవారం సెలవు కావడంతో, మార్కెట్లు ఈవారం నాలుగురోజులే పనిచేయనున్నాయి. 'నిఫ్టీ-50కి 23,000-23,200 పాయింట్ల స్థాయిలో నిరోధం ఎదురుకావొచ్చు. 22,400 వద్ద మద్దతు లభించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- ఆర్‌బీఐ ద్రవ్యలభ్యత చర్యల కారణంగా బ్యాంకు షేర్లకు సానుకూలతలు కనిపిస్తున్నాయి. బ్యాంక్‌నిఫ్టీ 48,000 పాయింట్ల పైకి వెళితే 49,300 దిశగాబీ ఆ స్థాయి కంటే కిందకు వెళితే బలహీనంగా చలించొచ్చు.
- అమెరికా ఆర్థిక గణాంకాల కారణంగా ఐటీ షేర్లు బలహీనంగా చలించొచ్చు. అయితే డిసెంబరు త్రైమాసికంలోని సానుకూల ఒప్పందాల తీరు, ప్రస్తుత త్రైమాసికంలోనూ కొనసాగుతాయన్న భావనలు కలిసిరావొచ్చు.
- సిమెంటు కంపెనీల షేర్లు రాబోయే కొన్ని వారాల పాటు స్థిరంగా ఉండొచ్చు. ధరల పెంపు నుంచి.. కంపెనీలు విక్రయాల వృద్ధి వైపు దృష్టి సారించనుండడం ఇందుకు నేపథ్యం.
- అమెరికా వాణిజ్య విధానాలపై అనిశ్చితి కారణంగా వాహన షేర్లలో లాభాలకు కాస్త అడ్డుకట్ట పడొచ్చు.
- లోహ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. ఇటీవలి ర్యాలీ నేపథ్యంలో, కొంత మేర మదుపర్లు లాభాలు స్వీకరించొచ్చు. ఉక్కుపై ట్రంప్ సుంకాలు విధించడంతో, దేశీయ మార్కెట్‌పై పరోక్ష ప్రభావం చూపొచ్చని అంచనా.
- ఔషధ షేర్లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. 3 వారాలుగా నష్టపోయిన ఈ షేర్లు పుంజుకోవచ్చు. టారిఫ్‌పై అనిశ్చితి ఇంకా కొనసాగుతుండడం గమనార్హం. రూపాయి కదలికలను మదుపర్లు గమనించాలి.
- ప్రస్తుత అనిశ్చితుల్లో రక్షణాత్మక రంగమైన ఎఫ్ఎమ్‌సీజీ వైపు మదుపర్లు దృష్టిసారించే అవకాశం ఉంది. నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీకి 53,200 పాయింట్ల వద్ద నిరోధంబీ 51,000 వద్ద మద్దతు కనిపిస్తోంది.
- స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల మినహాయింపునకు అనుమతి లభిస్తే టెలికాం కంపెనీలకు కలిసిరావొచ్చు. ఈ ఏడాది చివర్లో టారిఫ్‌లు పెంచొచ్చన్న అంచనాలున్నాయి.
- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతుండడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు స్వల్పకాలంలో సానుకూలంగా కదలాడొచ్చు. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.250 నష్టమే ఇబ్బందికరం.
- విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు(ఎఫ్‌పీఐ) విక్రయాలను కొనసాగిస్తుండడంతో యంత్రపరికరాల షేర్లకు స్వల్పకాలంలో ప్రతికూలతలు ఏర్పడొచ్చు. దీర్ఘకాలంలో ఆరోగ్యకర ఆదాయ వృద్ధి కారణంగా రాణించొచ్చు.

# చతికిల పడిన ఐపీఓ మార్కెట్

**న్యూఢిల్లీ:** సెకండరీ మార్కెట్లో కనిపిస్తున్న దిద్దుబాటు (కరెక్షన్) ప్రభావం ప్రైమరీ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. గత మూడు వారాలుగా ఒక్క ప్రధాన కంపెనీ షేరు కూడా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కాలేదు. గత ఏడాది డిసెంబరులో 16 కంపెనీలు నిధుల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేశాయి. ఈ ఏడాది జనవరి నాటికి వీటి సంఖ్య ఐదుకు, ఫిబ్రవరికి నాలుగుకు పడిపోయాయి. ఇన్వెస్టర్లు ఆదరిస్తారో.. లేదోననే భయంతో అడ్వాన్స్‌డ్ సిస్టెక్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వినీ కార్పొరేషన్ అనే మూడు కంపెనీలు ఏకంగా తమ ఐపీఓలనే పక్కన పెట్టాయి.




**వేచి చూసే వైఖరి**

గత ఏడాది 91 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి 'బేర్' పట్టుతో మార్కెట్ ట్రెండ్ మారింది. గత రెండు నెలల్లో లిస్టయిన ఐపీఓలూ మదుపరులకు పెద్దగా లాభాలు పంచలేక పోయాయి. అయినా మార్కెట్ కోలుకుంటే రూ.67,000 కోట్ల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేసేందుకు ఇప్పటికే 45 కంపెనీలు సెబీ ఆమోదం పొందాయి. ఇంకో రూ.1.15 లక్షల కోట్ల సమీకరణ కోసం మరో 69 కంపెనీలు సెబీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందులో 45 కంపెనీలు గత రెండు నెలల్లోనే దరఖాస్తు చేయడం విశేషం. మార్కెట్ కోలుకున్నా ఐపీఓల వాల్యుయేషన్లు సముచితంగా ఉంటే తప్ప మదుపరులు ఆదరించక పోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**ఏప్రిల్‌లో ఏథర్ ఎనర్జీ ఐపీఓ**

మరో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే నెల (ఏప్రిల్)లో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాల సమాచారం. ఈ ఐపీఓకు నాందిగా 1.73 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటి రూపాయి ముఖ విలువ ఉన్న 24.04 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చేందుకు ఏథర్ ఎనర్జీ బోర్డు ఈ నెల 8న ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓ కూడా రూ.5,000 కోట్లకుపైగానే ఉంటుందని సమాచారం.

**టాటా క్యాపిటల్**

టాటా గ్రూప్ నుంచి మరో బాహుబలి ఐపీఓ మార్కెట్‌కు రాబోతోంది. టాటా మోటార్స్ ఫైనాన్స్ కంపెనీని తనలో విలీనం చేసుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించిన వెంటనే ఐపీఓకు వచ్చేందుకు టాటా క్యాపిటల్ సిద్ధమవుతోంది. ఎన్‌సీఎల్‌టీ ఈ నెలాఖరులోగా ఇందుకు అనుమతిస్తుందని భావిస్తున్నారు.







## దళిత చైతన్య సంఘం ఆధ్వర్యంలో అందుల కళాశాలలో అన్నదానం....

హైదరాబాద్ మార్చి 7(జే ఎస్ డి ఎం న్యూస్ )

అనాధలకు,పేద మధ్యతరగతి వర్గాలకు దళిత చైతన్య సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ అన్నారు. సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బన్సి లాల్ పేట్ లోని దేవనార్ అందుల కళాశాలలో 200 వందల మంది అందులకు చికెన్ బిర్యానీ వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ మాట్లాడుతూ అందులకు ఒక పూట అన్నం పెట్టడం చాలా ఆనందంగా ఉందని. తమ సంఘం అణగారిన వర్గాలకు,పేద, మధ్యతరగతి ప్రజలకు ఎల్లపుడూ అండగా ఉంటుందన్నారు. అలాగే పేద ప్రజలు సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి వాటిని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, సతీష్ రాజ్, సాయి, వెంకట్, మనోజ్, విశాల్,సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.1.37 లక్షల కోట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఈనెల తొలి వారంలోనే రూ.24,753 కోట్ల (2.8 బిలియన్ డాలర్ల) ఈక్విటీలను వారు విక్రయించారు. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, దేశీయంగా కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల్లో మందగమనం ఇందుకు కారణం. ఈ ఏడాది జనవరిలో రూ.78,027 కోట్లు, ఫిబ్రవరిలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను వారు విక్రయించారు. ఫలితంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.1,37,354 కోట్ల అమ్మకాలు జరిపినట్లయ్యింది. ఎఫ్‌పీఐ పెట్టుబడుల నికర ఉపసంహరణ వరుసగా 13వ వారమూ కొనసాగినట్లయ్యింది. 2024 డిసెంబరు 13 నుంచి చూస్తే, ఇప్పటివరకు వారు రూ.1,48,770 కోట్ల నికర అమ్మకాలు జరిపారు.

**ఇవీ కారణాలు**

భారత్ సహా పలు దేశాల ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం వల్ల వాణిజ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇది మదుపర్లకు ప్రధానంగా ఆందోళన కలిగిస్తున్న అంశం. దేశీయంగా నిరుత్సాహకరంగా వెలువడిన కార్పొరేట్ ఫలితాలు, పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. అయితే డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ క్షీణించిన నేపథ్యంలో, ఇక్కడ విక్రయాలు జరుపుతున్న ఎఫ్‌పీఐలకు లభించే ప్రతిఫలం తగ్గుతోంది. మనదేశంలో విధిస్తున్న దీర్ఘ/స్వల్పకాల మూలధన లాభాలపన్ను కూడా కొంతమేర విదేశీ మదుపర్లను నిరుత్సాహ పరుస్తోందనే విశ్లేషణలూ వస్తున్నాయి. ఇక్కడ స్టాక్స్ విక్రయించి, పన్నుభారం లేని మార్కెట్లకు తమ పెట్టుబడులను వారు తరలిస్తున్నారనీ చెబుతున్నారు.

**చైనాపై ఆసక్తి కూడా**

పెద్ద వ్యాపారాలకు అండగా చైనా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పాటు, అక్కడి స్టాక్స్ విలువలు అందుబాటులో ఉన్నాయన్న అంచనాలతో విదేశీ పెట్టుబడులు అటు మళ్లాయి. ఫలితంగా ఏడాది క్రితంతో పోలిస్తే, హాంగ్‌సెంగ్ సూచీ 23.48% రాణించింది. ఇదే సమయంలో దేశీయ నిఫ్టీ 5% నష్టపోవడాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే ఈ ధోరణి తాత్కాలికమేనని, చైనా కార్పొరేట్ సంస్థల ఫలితాలు 2008 నుంచి అంతగా రాణించడం లేదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వివరించింది. డాలర్ ఇండెక్స్ క్షీణత నేపథ్యంలో, మన స్టాక్ మార్కెట్లలో విదేశీ మదుపర్ల అమ్మకాలు తగ్గుతాయనే అంచనాను వ్యక్తం చేసింది.



# మీ అంచనాలను అందుకోలేనుకుంటే
# నా సినిమా చూడొద్దు




నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో ‘దయ చేసి ఈ సినిమా చూడండి’ అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. ఇది మీ అంచనాలను అందుకోలేదు అనిపిస్తే రెండు నెలల్లో విడుదల కానున్న నా ‘హిట్ 3’ని ఎవరూ చూడొద్దు అని నాని అన్నారు. ఆయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్ర నటించిన చిత్రం ‘కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ’. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. ఈ నెల 14న థియేటర్లలో విడుదల కానుంది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రలకు ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితోపాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచం లోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని ‘కోర్ట్’తో నేను పొందగలిగా. ఇప్పుడా అనుభూతిని ప్రేక్షకులని పొందాలన్నది నా తాపత్రయం. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. అందుకే ఇంతగా బతిమలాడుతున్నా. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ మంచి సినిమా చూశామనే గర్వంతో బయటకు వస్తారు. ఇది మీ అంచనాల్ని అందుకోలేదు అనిపిస్తే మరో రెండు నెలల్లో విడుదల కానున్న ‘హిట్ 3’ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా నేనేమీ చెప్పలేను. ఎందుకంటే దీనికన్నా 10రెట్లు ఎక్కువగా ‘హిట్ 3’పై ఖర్చు పెట్టా. ఈ నెల 14 వరకే ‘ఈ సినిమా చూడమని అందరికీ చెప్తా. ఆ తర్వాత నుంచి మీరే ఆ మాట ప్రతి ఒక్కరికీ చెప్తారు” అన్నారు.

## ఫుల్‌టైమ్ టాలీవుడ్‌కి కేటాయిస్తున్న జాన్వీకపూర్



రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా ఫ్యాన్స్ తలచుకుంటే ట్రెండింగ్‌కి కొదవా అన్నట్టుంది పరిస్థితి. నిన్నటి నుంచి ఏక్థమ్ ట్రెండ్ అవుతూనే ఉన్నారు జాన్వీ కపూర్. ఇంతగా ట్రెండ్ కావడానికి బర్త్ డే సెలబ్రేషన్స్ మాత్రమే రీజనా.. అంటే.. అదేంటి గురూ అలా అంటున్నారు.. నెక్ట్స్ టాలీవుడ్‌ని ఏలేది ఆ అమ్మాయే అని అంటున్నారు ఫ్యాన్స్. చుట్టమల్లే చుట్టేసింది మన జాన్వీ కపూర్. మొన్న మొన్నటిదాకా బాలీవుడ్‌కే పరిమితమైనా.. ఏనాడూ ఆమెని పొరుగమ్మాయిలా చూడలేదు మనవాళ్లు. తెలుగు సినిమాలు చేసేయ్ అమ్మా అని బుజ్జగిస్తూనే ఉన్నారు. ఆ మాటలు విన్న శ్రీదేవి తనయ దేవరతో ఎంట్రీ ఇస్తే సినిమా బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. దేవరలో జాన్వీని చూసి మా తంగం అనుకున్నారంతా. దేవర సెకండ్ పార్టు కోసం ఆల్రెడీ 2026లో కాల్షీట్ కేటాయించేశారు ఈ బ్యూటీ. ఇప్పుడు మాత్రం రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌తో యమా బిజీగా ఉన్నారు. ఈ సినిమా నుంచి వచ్చిన జాన్వీ లుక్ అదిరిందంటున్నారు అభిమానులు. ఆర్సీ 16 షూట్ కంప్లీట్ కాగానే అల్లు అర్జున్ - అట్లీ సినిమా యూనిట్‌తో జాయిన్ అవుతారట శ్రీదేవి తనయ. ఐకాన్ స్టార్ పక్కన అద్భుతమైన రోల్ కుదిరిందంటూ హ్యాపీగా ఉన్నారట జాన్వీ. డ్యాన్సుల్లో బన్నీని ఈక్వెల్ చేయడానికి ఇప్పటి నుంచే కాసింత స్పెషల్‌గా శ్రద్ధ పెడుతున్నారట. తెలుగులో ఒకటికి మూడు సినిమాలు చేతిలో ఉన్నాయి జాన్వీకి. ముగ్గురు లీడింగ్ హీరోల మూవీస్‌లో చేస్తున్నారు.

## ఆ బాధ ఇప్పటికీ ఉంది



నేడు మహిళ దినోత్సవం సందర్భంగా మెగా ఫ్యామిలీ అంతా ఒక్కదగ్గరే చేరింది. మెగా వుమెన్స్ పేరుతో ఒక ఇంటర్వ్యూలో విడుదల కాగా.. ఈ ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవితో పాటు అతడి అమ్మ అంజనాదేవి తమ్ముడు నాగబాబు, చెల్లెల్లు పాల్గొన్నారు. ఇందులో మెగా కుంటుంబంకి సంబంధించిన ఎన్నో విషయాలను చిరుతో పాటు అంజనాదేవి తదితరులు పంచుకున్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలో చిరు మాట్లాడుతూ.. తన చెల్లి చనిపోయిన క్షణం ఇప్పటికీ గుర్తుకువస్తుందంటూ ఎమోషనల్ అయ్యాడు. అమ్మకు మేము ఐదుగురు సంతానం. అయితే మరో ముగ్గురు తోబుట్టువులు నా చిన్నతనంలోనే చనిపోయారు. నాన్న ఉద్యోగంలో బిజీగా ఉన్న సమయంలో అమ్మనే ఇంట్లో అన్ని పనులు చూసుకోవడంతో పాటు గృహిణిగా అన్ని బాధ్యతలు తన మీదే ఉండేవి. దీంతో చిన్ననాటి నుంచి తనకు సాయం చేసేవాడిని. అయితే నేను ఆరో తరగతి చదువుతున్న సమయంలో నాకు రమ అనే సోదరి ఉండేది. ఒకసారి సడన్‌గా జబ్బుపడింది. దీంతో నేను అమ్మ కలిసి తనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాం.

## సినిమాలకు రాకపోయి ఉంటే.. రాజకీయాల్లోకి వచ్చేవాడిని



తాను నటుడిని కాకపోయి ఉంటే పాలిటిక్స్‌లోకి వెళ్లేవాడినని తెలిపాడు యువ నటుడు కిరణ్ అబ్బవరం. ‘క’ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న కిరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘దిల్ రుబా’. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌కి సంబంధించి వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నాడు కిరణ్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తన జీవితంలోని ఆసక్తికర విషయాలను కూడా కిరణ్ తాజాగా పంచుకున్నాడు. సినిమాలకు రాకముందు జీవితంలో ఎదోకటి పెద్దగా సాధించాలనే కోరిక ఎప్పుడు ఉండేది. అందులో భాగంగానే హీరో అవ్వాలి అనుకున్నాను. అయితే నాకు రాజకీయాలు అంటే చాలా ఇష్టం. రాయాలసీమకి చెందిన వ్యక్తిగా రాజకీయాలను చిన్ననాటి నుంచి దగ్గరిగా చూశాను. ఒకవేళ నేను సినిమా హీరో కాకపోయి ఉంటే ఖచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్లేవాడిని. మంచి చెడుని పక్కనపెట్టి ప్రజలతో కలవడం నాకు ఇష్టం. దాని వల్లనే నాకు రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. అలాగే భవిష్యత్తులో నేను వ్యాపార రంగంలో కూడా అడుగు పెట్టాలని ప్లాన్ చేస్తున్నాను.

# పరిస్థితుల ప్రభావం అలా తప్పదు



మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల కూతురు నిహారిక గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడు యాంకర్‌గా ఇండస్ట్రీకి వచ్చి ఆ తర్వాత హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది. అయితే నిహారికకి ఒక్క సినిమా కూడా మంచి హిట్ అందించలేకపోయింది. ఇక నటిగా మంచి గుర్తింపు రావడం లేదని భావించిన నిహారిక నిర్మాతగా సినిమాలు చేయడం ప్రారంభించింది. ఈ మధ్య కమిటీ కుర్రాళ్లు అనే సినిమా చేయగా, ఈ మూవీ సూపర్ హిట్ అయింది. దీంతో ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు నిర్మాతగా మరి సినిమాలను కూడా నిర్మించాలని నిహారిక భావిస్తుంది. అయితే నిహారిక సినీ బ్యాక్‌గ్రౌండ్ లేని వ్యక్తి అయిన జొన్నలగడ్డ వెంకట చైతన్య అనే కుర్రాడిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీరి పెళ్లి డెస్టినేషన్ వెడ్డింగ్ పద్ధతిలో చాలా అట్టహాసంగా జరిగింది. అయితే వీరి పైవాహిక జీవితం రెండేళ్లకే ముగిసిపోయిందని చెప్పాలి. పెళ్లైన రెండు సంవత్సరాలకి విడాకులు తీసుకుని ఎవరి దారులు వారు చూసుకున్నారు. విడాకుల ప్రకటన తర్వాత వీరి విడాకులకి కారణం ఏమై ఉంటుందా అని పలువురు పలు రకాల చర్చలు జరిపారు. అయితే విడాకులు తీసుకున్న అనంతరం నిహారిక తిరిగి సినిమా ఇండస్ట్రీలో బిజీగా గడుపుతుంది. హీరోయిన్‌గా మంచి హిట్ కొట్టాలనే కసితో ఉంది. తాజాగా నిహారిక తన విడాకులపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. సెలబ్రిటీ హోదాతో సంబంధం లేకుండా, విడాకులు ఏ అమ్మాయికైన బాధాకరమైన అనుభవం అంటూ నిహారిక స్పష్టం చేసింది. పెళ్లి బంధంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎవరు కూడా విడాకుల గురించి ఆలోచించరు. కొన్ని సార్లు కొన్ని పరిమాణాలు వేరుగా ఉండడం, పరిస్థితులు అదుపు తప్పడం వలన కష్టమైన నిర్ణయాలు తీసుకోవల్సి ఉంటుంది. జీవితంలో సవాళ్ల నుంచి చాలా నేర్చుకునేందుకు ఆస్కారం ఉందని నిహారిక పేర్కొంది. గతంలో చాలా సందర్భాల్లో విడాకుల గురించి స్పందించడానికి ఇష్టపడని నిహారిక ఇప్పుడు మాత్రం భిన్నంగా కామెంట్స్ చేసింది. ఇక నిహారిక వయస్సు 31 ఏళ్లు అని తెలుస్తుండగా, ఆమె త్వరలో రెండో పెళ్లి చేసుకునే అవకాశం ఉంది.



సినిమా ఎలా ఉన్నా.. సక్సెస్ అని చెప్పుకునే రోజులు లేవిప్పుడు. సినిమా ఫలితాన్ని నటీనటులు ఓపెన్‌గానే చెప్పేస్తున్నారు. రిలీజ్ అయిన వెంటనే వాళ్లకి రిజల్ట్ తెలిసినా బిజినెస్ పరంగా ఏవో లావాదేవీలు ఉంటాయి కాబట్టి అప్పటికైతే సైలెంట్‌గా ఉంటున్నారు. కానీ తర్వాత తర్వాత మాత్రం ఓపెన్ అయిపోతున్నారు... జిగ్రాలో ఆలియా అద్భుతంగా నటించారు. తను ఆల్ఫా లేడీ అంటూ ఈ మధ్య ఆలియా భట్‌ని తెగ పొగిడేశారు సమంత. నటన పరంగా సమంత మాత్రమే కాదు.. చాలా మంది కాంప్లిమెంట్లు ఇచ్చేశారు ఆలియాకు. కానీ, సినిమా రిజల్ట్ అనుకున్నట్టే వచ్చిందా అంటే నో.. దీని గురించి రీసెంట్‌గా మాట్లాడారు ఆలియా. జిగ్రా తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు ఆలియా. దర్శకుడు వాసన్ బాలా ఎంతో కష్టపడి తీసినా, ఫలితం వేరేగా వచ్చింది.. అలాగని నిరాశపడిపోయి కూర్చోలేం కదా.. అన్నది ఆలియా చెబుతున్న మాట. అంతే కాదు.. తనకు నటనంటే ఇష్టమని, సినిమా అంటే ప్రాణమని.. అందుకే జయాపజయాలకు అతీతంగా సినిమాలు నిర్మిస్తున్నాననీ అంటున్నారు ఆల్ఫా లేడీ. ప్రస్తుతం ఆల్ఫాలో నటిస్తున్నారు ఆలియా. జయాపజయాలు ఆమెను ఏమాత్రం ప్రభావితం చేయవట. హిట్ వచ్చిందని ఖుషీ అవ్వడం, ఫ్లాప్ వచ్చిందని కుంగిపోవడం తనకు తెలియదంటారు ఈ లేడీ. ఓటమి ఎదురైనప్పుడు బాధ కచ్చితంగా ఉంటుందని, అయితే దాన్నుంచి చాలా త్వరగా బయటపడతాననీ, ఎవరైనా సరే దీన్ని ప్రాక్టీస్ చేయాలని సలహా ఇస్తున్నారు మిసెస్ రణ్‌బీర్ కపూర్ గతంతో పోలిస్తే ఇప్పుడు కాస్త స్పీడు తగ్గించారు ఆలియా. వేగంగా వెళ్లి ఫ్లాప్‌లు తెచ్చుకోవడం కన్నా, ఆచి తూచి అడుగులు వేసి మంచి సినిమాలు చేయాలని ఇలా ప్లాన్ చేసుకున్నారా? అనే టాక్ బాలీవుడ్‌లో బాగానే వినిపిస్తోంది.

# ఆ విషయంలో ఆలియాభట్ చాలా బెటర్



# మూడోసారి ట్రోఫీ కైవసం

## దుబాయ్‌లో ధూంధాం మనమే చాంపియన్స్

**దుబాయ్:** ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలిచింది. ఆశించిన రీతిలోనే నలుగురు స్పిన్నర్లు ప్రత్యర్థిని కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో కెప్టెన్ రోహిత్ (76), శ్రేయాస్ (48) నిలకడ చూపారు. దీంతో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 2000లో ఇదే టోర్నీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టయ్యింది. అలాగే భారత్ ఖాతాలో ఇది మూడో (2002, 2013, 2025) చాంపియన్స్ ట్రోఫీ. మరోవైపు తాజా టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలవడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 251 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (63), బ్రేస్‌వెల్ (53 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించగా రచిన్ (37), ఫిలిప్స్ (34) సహకారం అందించారు. కుల్దీప్, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు చేసి గెలిచింది. గిల్ (31), అక్షర్ (29) రాణించారు. స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రోహిత్, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా రచిన్ రవీంద్ర నిలిచారు.

**శతక భాగస్వామ్యంతో..:** ఓ మాదిరి ఛేదనలో భారత్‌కు మెరుపు ఆరంభమే దక్కింది. కానీ కివీస్ బౌలర్ల పోరాటంతో ఈ పోరు దాదాపు ఆఖరి ఓవర్ వరకు సాగి కాస్త ఉత్కంఠను రేకెత్తించింది. మొదటి నుంచీ రోహిత్ తన సహజశైలిలోనే చెలరేగాడు. ఈసారి చక్కగా క్రీజులో కుదురుకొని ఎక్కడా తగ్గకుండా బౌండరీలతో బెదరగొట్టాడు. గిల్‌కన్నా ఎక్కువగా తనే స్ట్రయికింగ్ తీసుకుంటూ స్కోరును పరిగెత్తించాడు. తొలి ఓవర్‌లోనే సిక్సర్ బాదిన అతడు రెండో ఓవర్‌లో రెండు ఫోర్లతో మరింత ఒత్తిడి పెంచాడు. ఇక ఎనిమిదో ఓవర్‌లో రోహిత్ 6,4,4తో 14 పరుగులు వచ్చాయి. ఈ జోరుతో హిట్‌మ్యాన్ ఫిఫ్టీ 41 బంతుల్లోనే పూర్తయ్యింది. అలాగే జట్టు స్కోరు 17 ఓవర్లలోనే 100 పరుగులకు చేరింది. కానీ ఈ దశలో కివీస్‌కు కాస్త ఊరట లభించింది. నిలకడగా సహకరిస్తున్న గిల్‌ను 19వ ఓవర్‌లో శాంట్నర్ అవుట్ చేశాడు. అతడి క్యాచ్‌ను ఎక్స్‌ట్రా కవర్‌లో ఫిలిప్స్ అమాంతం గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో పట్టేయడం హైలైట్‌గా నిలిచింది. దీంతో తొలి వికెట్‌కు 105 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్ (1)ను బ్రేస్‌వెల్ అవుట్ చేయడంతో స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. విరాట్ రివ్యూకు వెళ్లినా ఫలితం లేకపోయింది. రెండు వికెట్లు వేగంగా కోల్పోవడంతో జట్టు ఆటతీరులోనూ మార్పు కనిపించింది. బ్రేస్‌వెల్ పకడ్బందీ బంతులకు రోహిత్-శ్రేయాస్ అతి జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. ఓ దశలో 12 బంతుల్లో ఒక్క పరుగే రావడంతో ఓపిక నశించిన రోహిత్ రచిన్ ఓవర్‌లో ముందుకొచ్చి భారీషాట్ కొట్టే యత్నంలో స్టంపౌటయ్యాడు. అటు స్పిన్నర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేయడంతో సాధించాల్సిన రన్‌రేట్ ఆరు దాటింది. అక్షర్ సహాయంతో అడపాదడపా శ్రేయాస్ బౌండరీలు సాధించినా కివీస్ బౌలర్లదే పైచేయి అయ్యింది. ఈ దశలో జేమిసన్ అతడి సులువైన క్యాచ్‌ను వదిలేసినా... స్వల్ప వ్యవధిలోనే రచిన్ అద్భుత క్యాచ్‌కు శ్రేయాస్ వెనుదిరగాల్సి వచ్చింది. అప్పటికే ఈ జోడీ మధ్య నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. మరోవైపు బ్రేస్‌వెల్ విసిరిన చివరి ఓవర్‌లో అనవసర షాట్‌కు వెళ్లి అక్షర్ పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో మ్యాచ్ నువ్వానేనా అన్న రీతికి చేరింది. అయితే ఆఖర్లో రాహుల్‌కు జతగా హార్దిక్ (18) జోరు చూపాడు. 24 బంతుల్లో 21 రన్స్ కావాల్సిన వేళ హార్దిక్ ఓ సిక్స్, ఫోర్‌తో పరిస్థితి తేలిక చేశాడు. 48వ ఓవర్‌లో తను క్యాచ్ అవుటైనా అప్పటికే ఫలితం తేలిపోయింది. తర్వాతి ఓవర్‌లో ఓ ఫోర్‌తో జడేజా మ్యాచ్‌ను ముగించాడు.

**కివీస్ జోరుకు స్పిన్నర్ల బ్రేక్:** టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభం, ముగింపుల్లో అదరగొట్టినా.. మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్ల ధాటికి కుదేలైంది. లేదంటే 300 స్కోరు దాటేదే. అయితే ఫీల్డింగ్‌లో రోహిత్ సేన నాలుగు క్యాచ్‌లు జారవిడిచినా స్కోరు అతికష్టంగా 250కి చేరింది. చివర్లో బ్రేస్‌వెల్ వేగంగా ఆడాడు. సెమీసలో శతకం సాధించి ఊపుమీదున్న ఓపెనర్ రచిన్ కళ్లుచెదిరే షాట్లతో ఆకట్టుకున్నాడు. నాలుగో ఓవర్‌లో 6,4,4.. ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో వణికించాడు. అతడికి యంగ్ (15) సహకరించడంతో స్కోరు 7 ఓవర్లలోనే 50 దాటింది. కానీ ప్రమాదకరంగా మారిన ఈ జోడీని స్పిన్నర్ వరుణ్ విడదీశాడు. యంగ్‌ను ఎల్బీ చేయడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తొలి పవర్‌ప్లేలో 69/1 స్కోరుతో జోరు మీదున్న కివీసకు కుల్దీప్ తన వరుస ఓవర్లలో గట్టి ఝలక్ ఇచ్చాడు. ముందుగా ఓ గూగ్లీతో రచిన్‌ను క్లీన్ బౌల్డ్ చేయగా, తర్వాత వెటరన్ విలియమ్సన్ (11)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. అక్కడి నుంచి స్పిన్నర్ల హవా ఆరంభం కావడంతో కివీస్ పరుగుల కోసం చెమటోడ్చింది. 15-26 ఓవర్ల మధ్య కనీసం ఫోర్ కూడా సాధించకపోగా లాథమ్ (14) వికెట్‌ను కూడా కోల్పోయింది. చివరకు 81 బంతుల తర్వాత ఫిలిప్స్ ఓ సిక్సర్‌తో మురిపించాడు. 38వ ఓవర్‌లో ఫిలిప్సను వరుణ్ బౌల్డ్ చేయడంతో మిచెల్‌తో కలిసి ఐదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వికెట్లు పడుతున్నా మిచెల్ మాత్రం ఓపికగా ఆడుతూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 46వ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాక అతను వెనుదిరిగినా, బ్రేస్‌వెల్ ధాటికి ఆఖరి ఐదు ఓవర్లలో జట్టు 50 రన్స్ రాబట్టడం విశేషం.

### స్కోరుబోర్డు

**న్యూజిలాండ్:** యంగ్ (ఎల్బీ) వరుణ్ 15బీ రచిన్ (బి) కుల్దీప్ 37బీ విలియమ్సన్ (సి అండ్ బి) కుల్దీప్ 11బీ మిచెల్ (సి) రోహిత్ (బి) షమి 63బీ లాథమ్ (ఎల్బీ) జడేజా 14బీ ఫిలిప్స్ (బి) వరుణ్ 34బీ బ్రేస్‌వెల్ (నాటౌట్) 53బీ శాంట్నర్ (కోహ్లీ/రోహిత్-రనౌట్) 8బీ స్మిత్ (నాటౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 16బీ మొత్తం: 50 ఓవర్లలో 251/7. వికెట్ల పతనం: 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239బీ బౌలింగ్: షమి 9-0-74-1బీ హార్దిక్ 3-0-30-0బీ వరుణ్ 10-0-45-2బీ కుల్దీప్ 10-0-40-2బీ అక్షర్ 8-0-29-0బీ జడేజా 10-0-30-1.

**భారత్:** రోహిత్ (స్టంప్-లాథమ్) (బి) రచిన్ 76బీ గిల్ (సి) ఫిలిప్స్ (బి) శాంట్నర్ 31బీ విరాట్ (ఎల్బీ) బ్రేస-వెల్ 1బీ శ్రేయాస్ (సి) రచిన్ (బి) శాంట్నర్ 48బీ అక్షర్ (సి) ఓరౌర్కి (బి) బ్రేస్‌వెల్ 29బీ రాహుల్ (నాటౌట్) 34బీ హార్దిక్ (సి అండ్ బి) జేమిసన్ 18బీ జడేజా (నాటౌట్) 9బీ ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 49 ఓవర్లలో 254/6బీ వికెట్ల పతనం: 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241.బౌలింగ్: జేమిసన్ 5-0-24-1బీ ఓరౌర్కి 7-0-56-0బీ స్మిత్ 2-0-22-0బీ శాంట్నర్ 10-0-46-2బీ రచిన్ 10-1-47-1బీ బ్రేస్‌వెల్ 10-1-28-2బీ ఫిలిప్స్ 5-0-31-0.

గతేడాది టీ20 వరల్డ్‌కప్.. తాజాగా మన ఖాతాలో మరో ఐసీసీ టైటిల్. ఎప్పుడో పుష్కర కాలం కింద దక్కిన చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) తిరిగి టీమిండియా గూటికి చేరింది. అజేయ ఆటతీరుతో, అన్ని విభాగాల్లోనూ అదరగొడుతూ వహ్వా అనిపించుకున్న రోహిత్ సేన మూడో సీటీని సగర్వంగా అందుకుంది. అయితే ప్రమాదకర న్యూజిలాండ్ ఫైనల్లో అంత సులువుగా పట్టు వీడలేదు. భారత స్పిన్నర్ల ధాటికి ఆ జట్టు చేసింది 251 పరుగులే. ఛేదనలో రోహిత్ ధనాధన్ ఆటతీరుకు 17 ఓవర్లలోనే భారత్ స్కోరు 100కి చేరింది. ఈ దశలో సునాయాస విజయం ఖాయమనిపించినా.. మధ్య ఓవర్లలో పోటీలోకి వచ్చిన కివీస్ ఆటను రసవత్తరంగా మార్చింది. 31-40 ఓవర్ల మధ్య 55 పరుగులే ఇచ్చి గుబులు రేపింది. కానీ శ్రేయాస్, రాహుల్ సంయమన ఆటతీరు చూపారు. చివరికి జడేజా విన్నింగ్ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించిన భారత్.. కోట్లాది మంది అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది.

- వన్డే చరిత్రలో అత్యధికంగా 15 సార్లు వరుసగా టాస్ ఓడిన జట్టుగా భారత్. 2011-13 మధ్య నెదర్లాండ్స్ 11సార్లు వరుసగా టాస్ కోల్పోయింది.
- చాంపియన్స్ ట్రోఫీ ఓ ఎడిషన్‌లో అత్యధిక స్కోరు సాధించిన కివీస్ ప్లేయర్‌గా రచిన్ రవీంద్ర. మొత్తం 263 పరుగులు చేసిన రచిన్.. 2017 టోర్నీలో విలియమ్సన్ 244 పరుగుల రికార్డును అధిగమించాడు. కాగా, ఓవరాల్‌గా ఓ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా వెస్టిండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ (474 పరుగులు) టాప్‌లో ఉన్నాడు.
- భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రెండో ఆటగాడిగా కోహ్లీ. మూడు ఫార్మాట్లలో కలిపి విరాట్ 550 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కాగా, సచిన్ 664 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ?538 మ్యాచ్‌లతో ధోనీ, 509 మ్యాచ్‌లతో ద్రవిడ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.
- చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక పరుగులు సమర్పించుకొన్న రెండో భారత బౌలర్‌గా షమి. 9 ఓవర్లు బౌల్ చేసిన షమి 8.20 ఎకానమీతో 74 పరుగులిచ్చి.. ఓ వికెట్ పడగొట్టాడు. 2013 టోర్నీలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఉమేశ్ యాదవ్ 10 ఓవర్లలో 1/75 టాప్‌లో ఉన్నాడు.
- టోర్నీలో ఎక్కువ జీవనదానాలు లభించిన ఆటగాడిగా రచిన్. అతడు ఐదుసార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్నాడు. ఫైనల్ మ్యాచ్‌లోనే షమి, అయ్యర్ రెండుసార్లు రచిన్‌కు లైఫ్ ఇచ్చారు.
- ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లను చేజార్చారు. ఓ నాకౌట్ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాళ్లు ఇన్ని క్యాచ్‌లు వదిలేయడం చాలా అరుదు. రచిన్ ఇచ్చిన క్యాచ్‌లను షమి, అయ్యర్ నేలపాలు చేశారు. అయితే, అయ్యర్ క్యాచ్‌ను వదిలేసినప్పుడు స్టాండ్స్‌లో అనుష్క శర్మ రియాక్షన్ నెట్‌లో వైరల్‌గా మారింది. 38 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మిచెల్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను మిడ్‌వికెట్‌లో రోహిత్ అందుకోలేక పోయాడు. ఇక, ఫిలిప్స్ కొట్టిన క్యాచ్‌ను గిల్ చేజార్చాడు.
- కెప్టెన్‌గా వన్డేల్లో రోహిత్ వరుసగా కోల్పోయిన టాస్‌లు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో హిట్‌మ్యాన్ చివరిసారి టాస్ గెలిచాడు. 1998-99 మధ్య వెస్టిండీస్ సారథి బ్రియాన్ లారా 12 సార్లు వరుసగా టాస్ ఓడాడు. ఈ రికార్డును రోహిత్ సమం చేశాడు.

### కన్నీళ్లు పెట్టుకొన్న హెన్రీ..

గాయంతో ఫైనల్‌కు దూరమైన కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీ కన్నీళ్లు పెట్టుకొన్నాడు. భుజం నొప్పితో అతడు బాధపడుతున్నాడు. మ్యాచ్ సమయానికి కోలుకొంటాడని భావించారు. కాగా, ఉదయం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో హెన్రీ విఫలం కావడంతో అతడికి తుదిజట్టులో చోటుదక్కలేదు. దీంతో అతడు భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేక పోయాడు.

### రోహిత్‌కు కోహ్లీ సలహా

న్యూజిలాండ్ ఓపెనర్లు యంగ్, రచిన్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పైగా ఏడో ఓవర్‌లో రచిన్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను షమి చేజార్చాడు. దీంతో రోహిత్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. షమి చేతికి బంతి బలంగా తగలడంతో అతడు నొప్పితో విలవిల్లాడు. ఈ సమయంలో ఫిజియో చికిత్స చేస్తుండగా.. రోహిత్‌తో కోహ్లీ మాట్లాడుతూ కనిపించాడు. ఫీల్డింగ్‌లో మార్పుచేర్పులు చేయాలని సూచించాడు.